నేడు సామూహిక అక్షరాభ్యాసం

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకొని సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గాయత్రి పరివార్ సమక్షంలో గాయత్రిహోమం అనంతరం అక్షరాభ్యాసం ఉంటుందని అన్నారు. శ్రీహరినగర్‌లోని మౌంట్ లిటెర కిడ్డీ స్కూలులో అక్షరాభ్యాసం ఉంటుందని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

కూకట్‌పల్లి ఏసీపీగా శ్రీనివాస్



మూసాపేట: కూకట్‌పల్లి నూతన ఏసీపీగా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏసీపీగా పనిచేస్తున్న శివభాస్కర్ డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. హైదరాబాద్ ఐటీ సెల్ నుంచి శ్రీనివాస్ కూకట్‌పల్లి ఏసీపీగా బాధ్యతలు తీసుకున్నారు. శ్రీనివాస్ గతంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.


సమస్యలపై 'పశు సంవర్ధక శాఖ' వినతి

హిమాయత్‌నగర్: రాష్ట్ర పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం(టీఈఏ) వెటర్నరీ, యానిమల్ హస్బెండరీ నూతన కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ శాఖ కార్యాయంలో ప్రతినిధులు డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం టీఈఏ కేంద్ర సంఘం అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల మాట్లాడుతూ.. పశు సంవర్ధక శాఖలోని ఉద్యోగుల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జీఓ 317 ప్రకారం బాధిత ఉద్యోగులకు డిప్యుటేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరామని తెలిపారు. వీఏ నుంచి ఎల్ఎస్ఏ ప్రమోషన్లు త్వరగా ఇవ్వాలని కోరామన్నారు. నిబంధనలకు అనుకూలంగా ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టీఈఏ రాష్ట్ర కార్యదర్శి యాకుబ్ పాషా, నూతన ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.రాజు, మహిళ అధ్యక్షురాలు డాక్టర్ పి.వసంతకుమారి, చీఫ్ అడ్వైజర్ ఎ.కురుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి పి.కనకరాజు, కోశాధికారి ఎం.రామచంద్రం, కార్యవర్గ సభ్యులు ఎం.ప్రతాప్, ఎ.తిరుపతాచారి, ఎ.సైదులు, ఎం.బాబయ్య, కె.అశ్విని, బి.వనజ వల్లి, ఎల్.జానకి బాయి, ఎం.ఎ.ఖయ్యుం పాల్గొన్నారు.

7 ఘరా

'పది' పరీక్షల్లో ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు

త్వరలో జరగనున్న పది వార్షిక పరీక్షల్లో నూతన విధానం అందుబాటులోకి వచ్చింది. గతంలో ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు ఉండగా.. ఈ ఏడాది నుంచి ఏడు పేపర్లు ఉంటాయి. సామాన్య శాస్త్రం పరీక్షను రెండు రోజుల పాటు నిర్వహించడమే ఇందుకు కారణం.



ఈ వార్షిక పరీక్షల్లో సైన్స్ సబ్జెక్టు పరీక్షను రెండు రోజుల పాటు ఉండటంతో విద్యార్థుల కోసం టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సైన్స్ పరీక్షలో భాగంగా ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు వేర్వేరుగా ఉంటాయి. ప్రతి పేపర్‌కు 50 మార్కులు కేటాయించారు. ఇప్పటి వరకు సైన్స్ పరీక్షను ఒక్క రోజే జరిగేది. విద్యార్థులు, ఉపాధ్యాయుల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త పరీక్ష విధానానికి ఆమోదం తెలిపింది.

ప్రతి పేపర్‌కు 50 మార్కులు



బంజారాహిల్స్: వచ్చే నెల 18వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో సామాన్య శాస్త్రం (సైన్స్) పరీక్షను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఖైరతాబాద్ విద్యాశాఖ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలోని 17 ప్రభుత్వ ఉన్నత, 2 ఎయిడెడ్, 2 రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు. ఈ పరీక్షల్లో జోన్ పరిధి నుంచి సుమారు 1,800 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

గతంలో ఇబ్బందులివీ..

గతంలో రెండు పేపర్లు ఒకే రోజు నిర్వహించడంతో చదవడం, రాయడంలో విద్యార్థులు ఇబ్బందిపడేవారని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సురేందర్ తెలిపారు. అయితే, ఈసారి ఆ సమస్య ఉండదని స్పష్టం చేశారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలకు వేర్వేరుగా పాఠ్య పుస్తకాలు, వాటిని బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులను ఉండేవారని ఆయన గుర్తుచేశారు. అయితే, ఒకే రోజు పరీక్ష నిర్వహిస్తుండటంతో ఇద్దరు ఉపాధ్యాయులు చెప్పిన వేర్వేరు పాఠ్యాంశాలను కలిపి రాయాల్సి వచ్చేదన్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు గందరగోళానికి గురయ్యేవారని చెప్పారు. ఈక్రమంలో ఉత్తీర్ణత శాతం తగ్గడంతో పాటు చాలా మంది ఫెయిలైన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. దీంతో ఈ పరీక్షను వేర్వేరుగా నిర్వహించాలనే డిమాండ్ గత ఐదేళ్లుగా ఉందని.. అప్పుడు విద్యార్థుల కల నెరవేరిందని సురేందర్ చెప్పారు.

విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేలా..

సైన్స్ పరీక్ష వేర్వేరుగా నిర్వహించడం వల్ల విద్యార్థులు తమ సామర్థ్యం తెలుసుకునేందుకు వీలుంటుంది. అదేవిధంగా సబ్జెక్టులపై దృష్టి పెట్టేందుకు టీచర్లకు సైతం అవకాశం ఉంటుందని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-7లోని గవి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జనార్దన్ తెలిపారు. గణితం, ఫిజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు కెమిస్ట్రీ, ఇంజినీరింగ్ తదితర రంగాలను కెరీర్‌ను ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. బయోలాజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపితే బోటనీ, జువాలజీ, మెడికల్, డెంటల్, వెటర్నరీ, ఫార్మసీ, అగ్రికల్చర్, నర్సింగ్ తదితర రంగాల్లో మంచి ప్రతిభ చూపేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా, సైన్స్‌లో రెండు పేపర్లు వేర్వేరుగా నిర్వహించడం వల్ల విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఫలితాలు కూడా మెరుగ్గా వస్తాయని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఆలయాలకు విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న దాతలు

మూసాపేట: మూసాపేటలోని పలు ఆలయాలకు ఎక్కల్‌దేవ్ మైసయ్య యాదవ్ 10వ వర్ధంతి సందర్భంగా పలు దేవాలయాలకు ఆయన కుటుంబసభ్యులు నగదు విరాళం అందజేశారు. మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి రూ.2.50 లక్షలు, మైసమ్మ చెరువు అలుగులోని ఈదమ్మ ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు, మైసమ్మ చెరువు వద్ద ఉన్న ధోబీఘాట్ వద్ద ఈదమ్మ ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.25వేలు విరాళంగా అందజేశారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులను చేపట్టాలి


యూజీడీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయం సర్దార్ పటేల్ విగ్రహం, బాబు జగ్జీవన్‌రామ్ బస్తీల్లో యూజీడీ పనులను మంగళవారం కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితమే యూజీడీ పనులు మంజూరైనప్పటికీ ఎన్నికల కారణంగా పనులు ఆలస్యంగా చేపట్టామన్నారు. కాంట్రాక్టర్లు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్‌సలోమి, వర్కు ఇన్‌స్పెక్టర్ వినయ్, బీజేపీ నాయకులు మల్లేష్‌గౌడ్, బస్తీ అధ్యక్షుడు రమేష్, శ్రీనివాస్, మహిళా నాయకులు జానకి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే నా మొదటి ప్రాధాన్యత


సమస్యలను అడిగి తెలుసుకున్న బండి రమేష్ తదితరులు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఫతేనగర్ డివిజన్‌లోని ముఖ్య నాయకులతో కలిసి ఇందిరాగాంధీ నగర్, ప్రభాకర్‌రెడ్డి కాలనీల్లో పర్యటించి అక్కడి సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కె.రమేష్, టీపీసీసీ ప్రోటోకాల్ సెక్రటరీ సూరజ్ తివారీ, నాయకులు కె. రాజు ముదిరాజ్, కృష్ణ, అబ్దుల్ బాకీ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రజనీకాంత్


నియామక పత్రం అందుకుంటున్న రజనీకాంత్

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోనే ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉంటారని కూకట్‌పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌కు చెందిన రజనీకాంత్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి యూత్ జిల్లా అధ్యక్షుడు కంది శ్రావణ్‌రెడ్డి మంగళవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం రజనీకాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా యువతకు రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసిందన్నారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కంది శ్రావణ్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

18నమహర్షిదయానంద సరస్వతి జయంతి

రాయదుర్గం: ఆర్యసమాజ్ సంస్థాపకుడు మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలను ఈ నెల 18న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, తెలుగు రాష్ట్రాల ఆర్యసమాజ్ ప్రతినిధి డాక్టర్ ధర్మతేజ వెల్లడించారు. ఈ మేరకు వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటలకు శోభాయాత్ర కూడా ఉంటుందన్నారు. ఒక ప్రచార రథాన్ని తయారుచేసి ఉభయ రాష్ట్రాలలోని అన్ని గ్రామాలలో మహర్షి దయానందుని బోధనలను, ప్రదేశాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన గోధుమలు, బియ్యం స్వాధీనం

మోతీనగర్: పద్మావతి నగర్‌లో ఎస్‌పి ఎంటర్‌ప్రైజస్ కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన గోధుమలు, బియ్యాన్ని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు, అల్లాపూర్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో దాడులు న్విహించారు. 20టన్నుల గోధుమలు, 3.5 టన్నులు ప్రభుత్వం అందజేస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఓటీ జోన్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, అల్లాపూర్ సఫ్దార్‌నగర్ సెక్టార్ ఎస్‌ఐ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలానగర్ సివిల్ సప్‌లై అధికారులు సందర్శించారు.


పద్మావతినగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం,గోధుమలు

తరలి వెళ్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



నల్లగొండకు గులాబీ దళం

కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నల్లగొండలో పోరు గర్జన సభ జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తమ కార్యకర్తలతో కలిసి వెళ్లారు.

– కూకట్‌పల్లి


పార్టీ నేతలతో కలిసి బయల్దేరిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


తరలి వెళ్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ప్రా. అరుణకుమారికి శుభాకాంక్షలు


ప్రా. అరుణకుమారికి శుభాకాంక్షలు తెలుపుతున్న జేఏసీ నేతలు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ పరీక్షల విభాగాధిపతిగా ప్రొఫెసర్ అరుణకుమారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు, వివిధ సంఘాల నేతలు మంగళవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి మాట్లాడుతూ నూతనంగా.. విభాగాధిపతిగా విద్యార్థులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేయాలన్నారు. పరీక్షలు, రెగ్యులేషన్, క్రెడిట్స్ వంటి సమస్యలపై సకాలంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. పరిశోధన విద్యార్థులను రిపోర్టులు రావడానికి సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వ్యవధి పడుతుండటంతో అవకాశాలు కోల్పోతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గర్ సందీప్, అంబటి తేజ, దాస్యం విక్రాంత్ బంజారా సంఘం రాష్ట్ర సంఘం అధ్యక్షుడు భాను ప్రకాష్, ఎర్రవెల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తా


జయశంకర్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయశంకర్‌నగర్ బస్తీలో మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలు, ప్రభుత్వం మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాస్, మునెపల్లి సాంబశివరావు, శేషు, శిరీష, రవి, రఫిక్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచభాషల్ని కలుపుకోగలిగే శక్తి తెలుగు భాషకే ఉంది'

రాయదుర్గం: ప్రపంచంలోని అనేక భాషలను తనలో కలుపుకోగలిగే సహజత్వాన్ని కోల్పోని మహత్తర శక్తి తెలుగు భాష సొంతమని మహాసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మానవీయ శాస్త్రాల ఆడిటోరియంలో 'వెయ్యేళ్ల తెలుగు పద్య సాహిత్య వైభవం' అనే అంశంపై తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ తెలుగు ద్రావిడ భాషా జన్యమే అయినా, అధికంగా సంస్కృత ప్రభావం ఉందని, దాని వల్ల వేద సంస్కృతి తెలుగుభాషలో కనిపిస్తుందని చెప్పారు. మానవుల మనస్తత్వం ఆంధ్ర మహాభారతంలో ఉందని, దానిని నన్నయ ఎంతో పరిశీలనతో వివిధ పాత్రల రూపంలో సృజనీకరించారన్నారు. మానవీయ శాస్త్రాల విభాగం డీన్ కృష్ణ మాట్లాడుతూ ఇతర భాషలతో పోలిస్తే తెలుగుకు గొప్ప రమణీయత, ఇతర భాషల్లో లేని అనేక ప్రక్రియలు ఉన్నాయని గుర్తు చేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతుడు భువన్

భాగ్యనగర్‌కాలనీ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సిఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా మండపేట కేశవాపురంకు చెందిన తమ్మనపూడి భువన్ (24) అడ్డగుట్ట సొసైటీలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. భువన్ తండ్రి చనిపోవంతో తల్లి ఆరోగ్యం బాగా లేకపోవటంతో వచ్చిన జీతంతో తల్లికి చికిత్స చేయిస్తున్నాడు. జీతం సరిపోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన భువన్ హాస్టల్‌లోని ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి మృతుడి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బీజేపీ విధానాల పై పోరాడాలి'

హిమాయత్‌నగర్: 'మత సామరస్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆశయాలు, లక్ష్యాల కోసమే పోరాడుదాం' అనే అంశంపై హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం సెమినార్ జరిగింది. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షత వహించారు. పూలే-అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఫిలాసాఫికల్, ఇంగ్లిష్ ట్రైనింగ్ డైరెక్టర్ డాక్టర్ బాలబోయిన సుదర్శన్ మాట్లాడారు. జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గోవిందా పన్సర్ లాంటి మహనీయులు శివాజీ వాస్తవ చరిత్రను తీసుకొచ్చే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు


ఎస్ వైష్ణవి 95.62 | శ్రీజ 92.29 | సాయిరామ్ 99.46 | వెంకటేష్ 99.31

రాయదుర్గం: జేఈఈ మెయిన్స్ ఫేజ్-1లో గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు తమ సత్తా చాటారు. కళాశాల ప్రిన్సిపల్ శారద మంగళవారం మాట్లాడుతూ 108 మంది సెకండ్ ఇయర్ ఎంపీసీ విద్యార్థులు పరీక్ష రాశారని అందులో 90 పర్సంటైల్‌పైన ఏడు మంది విద్యార్థులు సాధించారని వివరించారు. అంతేకాకుండా 80 పర్సంటైల్..25 మంది అని, 50 పర్సంటైల్..80 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. ఎస్ వైష్ణవి 95.62 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచారన్నారు. బి భార్గవి 93.07, ఆర్ కృతిక 92.87, టి శ్రీజ 92.29, యూ ప్రియాంజలి 92.15, ఎల్ శుభశ్రావ్య 91.28, పి కృష్ణవేణి 91.28 పర్సంటైల్ సాధించి కళాశాలలో టాపర్లుగా నిలిచారని ఆమె వివరించారు.

- అలాగే గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర ఐఐటీ, నీట్ అకాడమీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ పాపారావు తెలిపారు. కళాశాల నుంచి 22 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా సాధించారన్నారు.

హెచ్‌సీయూలో బయో అన్వేషణ-2024

ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహణ

రాయదుర్గం: ప్రతిష్టాత్మకమైన బయోఅన్వేషణ-2024ను నిర్వహణకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వేదికకానుంది. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బయో అన్వేషణ్ అనేది జీవశాస్త్రం యొక్క రహస్యాలను అన్వేషించడంలో మానవాళికి ఉపయోగపడే సాంకేతికతలోని అంశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమాలు సాగుతాయి. పలువురు శాస్త్రవేత్తలు, బయోటెక్నాలజీ రంగంలోని నిపుణులను భాగస్వాములను చేస్తారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ రాజేష్ గోఖలే, ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, నోబెల్ గ్రహీత రిచర్డ్ జే రాబర్ట్స్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సరోజినీనాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని తపస్వీ ఫౌండేషన్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరోజినీనాయుడు జయంత్యోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ మహిళా సాధికారతకు కృషి చేశారన్నారు. నేటి మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఉమా చంద్రశేఖర్, మల్లేష్, పాలం శ్రీను, అమ్మయ్య చౌదరి, చప్పిడి కృష్ణ యాదవ్, ఆశ్రమ నిర్వాహకురాలు శాంతి తదితరులు పాల్గొన్నారు.

'ఫారెస్ట్ లిట్టర్ కంపోస్ట్'పై మరిన్ని పరిశోధనలు చేయాలి


వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారితో విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్, వాణీప్రసాద్ తదితరులు

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్

గచ్చిబౌలి: దేశంలో ఫారెస్ట్ లిట్టర్ కంపోస్ట్ ఉపయోగించడంపై మరిన్ని పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ)లో డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్ అధ్యక్షతన 'అటవీరంగంలో వాతావరణ స్థితిస్థాపకతను నిర్మించడం, కార్బన్ క్రెడిట్స్, కార్బన్ ట్రేడింగ్, గ్రీన్ క్రెడిట్' అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మట్టి సూక్ష్మజీవుల ద్వారా కార్బన్ సీక్వెస్ట్రేషన్‌కు సహాయం చేయడానికి ఫారెస్ట్ లిట్టర్ కంపోస్ట్ వినియోగం మరింత పెరగాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో పచ్చదనం కొనసాగించడం, హరిత సంపదను సరంక్షించడానికి కార్బన్ క్రెడిట్, కార్బన్ ట్రేడింగ్ ద్వారా ప్రయోజనాలను పెంచే మార్గాలను గుర్తించడానికి మార్గాలను పరిశోధించిందన్నారు. అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ప్రభాకర్, డాక్టర్ శేష శ్రీనివాస్, సీనియర్ సైంటిస్ట్ ప్రణబ్‌చౌదరి పాల్గొన్నారు.